10-10-26:Layout 1 10/16/2026 11:40 PM Page 1

నేటి దిక్సూచి
తెలుగు దినపత్రిక

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యం!

## మెరిట్, రోస్టర్ పాయింట్ల ఆధారంగానే నియామకాలు

## –ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు అడిగితే నమ్మొద్దు

## –దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

## డీఎంహెచ్‌వో డాక్టర్ రాహుల్



**నల్లగొండ / నేటి దిక్సూచి :** నల్లగొండ జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో చేపట్టనున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాహుల్ వెల్లడించారు. ఉద్యోగాల ఎంపికలో ఎలాంటి అక్రమాలకు, పైరవీలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. పలు దినపత్రికలో ప్రచురితమైన ఉద్యోగ నియామకాలకు సంబంధించిన వార్తపై ఆయన స్పందిస్తూ, ఎంపిక ప్రక్రియ పూర్తికాకముందే ఉద్యోగాల విక్రయాలంటూ ప్రచారం చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల ఖాళీల భర్తీకి చేపట్టే నియామకాల్లో అభ్యర్థుల అర్హతలు, మెరిట్ జాబితా, ప్రభుత్వ రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లనే ప్రాతిపదికగా తీసుకుంటామని డాక్టర్ రాహుల్ తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అలాంటి వ్యక్తులను నమ్మి మోసపోవద్దని నిరుద్యోగులకు సూచించారు. ఈ తరహా ఘటనలు తమ దృష్టికి తీసుకొస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియామకాలకు సంబంధించిన వివరాలు, మెరిట్ జాబితాలను అధికారిక వెబ్‌సైట్, కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచుతామని వివరించారు.

### ఒక్కో పోస్టుకు వందల దరఖాస్తులు

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించిందని డీఎంహెచ్‌వో తెలిపారు. స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ తదితర పోస్టులకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు.

### నిబంధనల ప్రకారమే ఎంపిక ప్రక్రియ

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఎంపిక ప్రక్రియ చేపడతామని డాక్టర్ రాహుల్ స్పష్టం చేశారు. అర్హతలు, మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా తుది జాబితాను రూపొందిస్తామని తెలిపారు. నియామకాల్లో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ, ఎంపిక వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# ఖాకీ దుస్తుల వెనుక ఆప్యాయత..

# మహిళా కానిస్టేబుల్ అఖిలకు శ్రీమంతం!




**ఆదిబట్ల / నేటి దిక్సూచి :** పోలీసులంటే విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరించే వారే కాదు.. ఆప్యాయత, అనురాగం, మానవీయ విలువలు కలిగిన వారని ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ సిబ్బంది నిరూపించారు. స్టేషన్‌లో గత ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ అఖిల తొమ్మిది నెలల గర్భవతి కావడంతో, ఆమె జీవితంలో ప్రత్యేకమైన ఈ సందర్భాన్ని సహచర పోలీసులు వేడుకగా మార్చారు. కుటుంబ సభ్యుల మాదిరిగా అండగా నిలుస్తూ ఘనంగా శ్రీమంతం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో అఖిలకు సంప్రదాయబద్ధంగా చీర, సారె అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. విధుల్లో నిత్యం ఒత్తిళ్లు, సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజాసేవలో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది.. తమ సహచరురాలి జీవితంలోని ఆనందకరమైన ఘట్టాన్ని కలిసి పంచుకున్నారు. స్టేషన్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం సిబ్బంది మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ మాట్లాడుతూ, మహిళా పోలీసు సిబ్బంది విధుల పట్ల చూపుతున్న అంకితభావం ప్రశంసనీయమని అన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ప్రజాసేవలో మహిళా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా




ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొని కానిస్టేబుల్ అఖిలకు శుభాకాంక్షలు తెలియజేశారు.